సాక్షి ప్రకాశం

మంగళవారం । 25 । జూన్ । 2024



బోసిపోయిన తీరప్రాంతం

చీరాల వాడరేవు, రామాపురం సముద్రతీర ప్రాంతాల్లో ఇటీవల వరుస ప్రమాదాలు జరగడంతో పర్యాటకులకు పోలీసులు అనుమతి నిరాకరించారు.

- 8లో..



ఫిర్యాదుల పరిష్కారంలో సమయపాలన పాటించాలి

మీ కోసంలో వచ్చే ఫిర్యాదుల పరిష్కారంలో సమయపాలన పాటించాలని కలెక్టర్ ఆదేశించారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
39.8/28.1

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

బ్యాంకులు అందించే సేవలపై అవగాహన కార్యక్రమం



మాట్లాడుతున్న జిల్లా నాబార్డ్ డీడీఎం జే రవికుమార్

మద్దిపాడు: జిల్లాలో పలు బ్యాంకులు అందించే సేవలపై లీడ్‌బ్యాంక్ ప్రకాశం జిల్లా డీడీఎం జె.రవికుమార్ పలువురు ప్రజలకు అవగాహన కల్పించారు. సోమవారం మండల కేంద్రం మద్దిపాడు సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ ఎవైర్‌నెస్ వర్క్‌షాపునకు ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన డిపాజిటర్స్‌లో అభద్రత తొలగింపు, డిపాజిట్స్, డిపాజిట్ ఖాతాల గురించి తెలుసుకోవడం, బ్యాంక్ ఖాతా తెరవడం లావాదేవీలు నిర్వహించడం, డిపాజిట్ ఖాతాల్లో ఉన్న అదనపు ప్రయోజనాలు, ఫిర్యాదు పరిష్కార వ్యవస్థ, భారతదేశంలో చెల్లింపు, పరిష్కార వ్యవస్థ రిజర్వ్ బ్యాంక్‌లో ఇటీవల కల్పించిన సదుపాయాలు వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ఆర్థిక అక్షరాస్యత కలిగి ఉండాలని ఆయన ప్రజలకు తెలిపారు. కార్యక్రమంలో ఈ ప్రాజెక్టు డైరెక్టర్ ఆంజనేయులు ప్రాజెక్ట్ మేనేజర్ అశోక్ కుమార్, ఎంపీడీఓ శ్రీహరి, గ్రామ కార్యదర్శి ఆశాలక్ష్మి, కెనరా బ్యాంక్ మేనేజర్ శ్రీధర్, రిసోర్స్ పర్సన్‌లు రవి తేజ, ఏ.చిన్నరాజా, ఎస్ అమృత రాజు, పలువురు ప్రజలు పాల్గొన్నారు.

వీఓఏలుగా రాజీనామా చేయండి

- టీడీపీ నేతల బెదిరింపులు
- వంతపాడిన ఏపీఎం

జరుగుమల్లి(సింగరాయకొండ): పొదుపు సంఘాల వీఓఏలుగా రాజీనామా చేయాలని టీడీపీ నాయకులు, ఏపీఎం భాగ్యలక్ష్మి తమపై ఒత్తిడి చేస్తున్నారని నర్శింగోలు, రెడ్డిపాలేనికి చెందిన ముగ్గురు వీఓఏలు ఆరోపించారు. నర్శింగోలు గ్రామానికి చెందిన కూచిపూడి బ్రాహ్మణి, పావులూరి మానస, రెడ్డిపాలేనికి చెందిన సోము పావని వీఓఏలుగా విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో బ్రాహ్మణి సుమారు 15 ఏళ్లగా వీఓఏగా బాధ్యతలు నిర్వహిస్తుండగా, మిగిలిన ఇద్దరు ఐదేళ్ల క్రితం విధుల్లో చేరారు. అయితే ఈ ముగ్గురిపై వైఎస్సార్ సీపీ సానుభూతిపరులనే ముద్ర వేసిన టీడీపీ నాయకులు, రాజీనామా చేయించాలని ఏపీఎంతో బెదిరించారు. వీరి నుంచి బ్యాంకు రికార్డులు కూడా స్వాధీనం చేసుకున్నారు. తమ పని తాము చేసుకుంటుంటే రాజకీయాలు ఆపాదించడం సరికాదని, మహిళలని కూడా చూడకుండా బెదిరించడం ఏమిటని వీఓఏలు ప్రశ్నించారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని తమను వీఓఏలుగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఘనంగా గానాల రామ్మూర్తి 88వ వర్ధంతి

ఒంగోలు మెట్రో: రావు సాహెబ్ గానాల రామ్మూర్తి 88 వ వర్ధంతి కార్యక్రమం గానాల రామ్మూర్తి విగ్రహ కమిటీ అధ్యక్షుడు వేల్పూరి వెంకట రామారావు ఆధ్వర్యంలో గానాల రామ్మూర్తి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘీయులు చిడిపోతు శివ వెంకట సుబ్రహ్మణ్యం, కానాల వెంకటేశ్వర్లు, రావినూతల నాగేశ్వరరావు, ఆదిమూలం సుబ్బారావు తదితర విశ్వబ్రాహ్మణులు పాల్గొని ఘనంగా నివాళులర్పించారు.

క్షణాల్లో వేట..

- అరుదైన గద్దలకు నిలయంగా నల్లమల అభయారణ్యం
- ఇతర దేశాల నుంచి నల్లమలకు వివిధ రకాల గద్దల రాక
- పాములు, ఉడుములు, పిల్ల జింకలే ఆహారం
- ఆకాశంలో వెయ్యి అడుగుల ఎత్తులో సంచారం



వేల అడుగుల ఎత్తున సంచరిస్తున్నా..భూమిపై ఉండే పాముల వంటి సరీసృపాలు, కుందేళ్ల వంటి చిన్న క్షీరదాలను ఒక్క ఉదుటున వచ్చి క్షణాల్లో తన బలమైన కాళ్లు, ముక్కుతో వేటాడి ఎత్తుకెళ్లిపోయే అరుదైన గద్దజాతి పక్షులు నల్లమల అభయారణ్యంలో సంచరిస్తున్నాయి. కాలాలను అనుసరించి దేశాలు దాటొచ్చి ఇక్కడ విడిది చేసి తమ సంతానాన్ని వృద్ధి చేసుకుని వెళ్లే ఈ గద్దజాతి పక్షులు ఎంతో విలక్షణమైనవి. వందల సంఖ్యలో ఉండే ఈ గద్దలు అడవిలోని జీవవైవిధ్యాన్ని పరిరక్షిస్తుంటాయి. నల్లమలలో సంచరించే వివిధ రకాల గద్దల విశేషాలేమిటో చూద్దాం..

మార్కాపురం:

మాంసాహారం మాత్రమే తినే నాలుగైదు రకాల గద్దజాతి పక్షులు వేలాది కిలోమీటర్లు ప్రయాణించి వచ్చి నల్లమలలో సంచరిస్తుంటాయి. నల్లమల అరణ్యానికి ఆసియా ఖండంలోని నేపాల్, భూటాన్, పాకిస్థాన్, మయన్మార్, బంగ్లాదేశ్, శ్రీలంక తదితర దేశాల నుంచి వివిధ రకాల గద్దలు ఆహారం కోసం వేల కిలోమీటర్లు ప్రయాణం చేసి వస్తున్నాయి. నల్లమల అటవీ ప్రాంతానికి వచ్చి గుడ్లు పెట్టి పొదిగి పిల్లలకు ఆహార అలవాట్లు నేర్పుతాయి. ఇవి సుమారు 4 వేల నుంచి 5 వేల కిలోమీటర్లు ప్రయాణం చేసివస్తాయి. ప్రధానంగా గద్దజాతిలో అరుదైన క్రెస్టెడ్‌హాక్ ఈగల్ (నల్ల పాముల గద్ద), క్రెస్టెడ్ సర్పెంట్ ఈగల్ (పాముల గద్ద), షార్ట్ టోడ్ స్నేక్ ఈగల్, హనీ బజర్డ్ తదితర రకాల గద్దలు ప్రస్తుతం నల్లమల అభయారణ్యంలో సంచరిస్తున్నాయి. వీటి జీవన విధానం కూడా విచిత్రంగా ఉంటుంది. ఆకాశంలో వెయ్యి అడుగుల ఎత్తులో తిరుగుతూ కింద ఉన్న పాములు, జింక పిల్లలు, ఉడతలు, కుందేళ్లు, ఉడుములను చంపి తింటుంటాయి. వందల సంఖ్యలో సంచరించే వివిధ రకాలైన గద్దలు నల్లమలలో జీవవైవిధ్యాన్ని పరిరక్షించడంలో ప్రధాన భూమిక పోషిస్తాయి. కొన్ని అరుదైన జాతి గద్దలు అంతరించే దశలో ఉన్నాయి.

షార్ట్‌టూడ్ స్నేక్ ఈగల్..

ఈ గద్దను తెలుగులో పాముల గద్ద అంటారు. మధ్యధరా బేసిన్ అంతటా, రష్యా, మధ్యప్రాచ్యం, పశ్చిమ ఆసియాలోని కొన్ని ప్రాంతాలు, భారత ఉపఖండంలో, కొన్ని ఇండోనేషియా ద్వీపాలలో తూర్పున కనిపించే పురాతన జాతికి చెందిన ఈ గద్దలు నల్లమలకు వలస వస్తాయి. ఆకాశంలో 400 నుంచి 600 అడుగుల ఎత్తులో ప్రయాణిస్తుంటుంది. వీటిలో పెద్దవి 62–67 సెం.మీ పొడవు, 170–185 సెం.మీ రెక్కలు, 1.2–2.3 కిలోల బరువు కలిగి ఉంటాయి. వీటి కింద భాగం తెల్లగా, పై భాగం బూడిద రంగులో ఉంటుంది. గడ్డం, గొంతు, ఎగువ రొమ్ము లేత, మట్టి గోధుమ రంగు కలిగి ఉంటుంది. తోకలో 3 లేదా 4 బార్‌లు ఉన్నాయి. ప్రధానంగా పాములు, కొన్ని బల్లులు, కుందేళ్ల వంటి చిన్న క్షీరదాలు, అరుదుగా చిన్నపక్షులు, పెద్ద కీటకాలను వేటాడి తింటాయి. సంతానోత్పత్తి చేసినప్పుడు ఇది ఒక గుడ్డు మాత్రమే పెడుతుంది. ఇది 17 సంవత్సరాల వరకు జీవించగలదు.

హనీబజర్డ్ ఈగల్



ఇది కూడా గద్దజాతికి చెందిన ఒక పక్షి. ఇది కేవలం అడవుల్లో తేనెపట్టులో ఉన్న లార్వాలను తిని జీవిస్తుంది. తెలుగులో తేనెగద్ద అంటారు. కొన్ని దేశాల్లో ఓరియంటల్ హనీబజర్డ్ అని పిలుస్తుంటారు. దీని పొడవు 57 నుంచి 67 సెం.మీల మధ్య ఉంటుంది. సెర్బియా, జపాన్ వంటి దేశాల నుంచి ఇవి నల్లమలకు వలస వస్తాయి. చిన్న మెడ, పొడవైన తోక, విశాలమైన రెక్కలు కలిగి ఉంటాయి. వీటిలో మగపక్షుల కన్నా ఆడపక్షులు పెద్దవిగా ఉంటాయి. సాధారణంగా ఒక్కో ఆడపక్షి రెండు గుడ్లు పెడుతుంది. 4 నుంచి 5 వారాలపాటు పొదుగుతాయి.

క్రెస్టెడ్ హాక్ ఈగల్



దీనిని మార్ష్ హాక్ ఈగల్ అని, తెలుగులో నల్లపాముల గద్ద అంటారు. ఇది పూర్తిగా మాంసాహారి. జింకపిల్లలు, ఉడుతలు, కుందేళ్లు, పాములు, ఉడుములు దీని ఆహారం. 10 నుంచి 14 సెం.మీ పొడవు ఉంటాయి. మగపక్షులు 1.36 కేజీలు, ఆడ పక్షులు 1.6 కేజీల వరకు ఉంటాయి. దక్షిణ ఆసియాలోని ఇండియా, నేపాల్, బూటాన్, మయన్మార్, శ్రీలంక దేశాల్లో ఎక్కువగా ఉంటాయి. మనదేశంలో రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, బీహార్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌లో సంచరిస్తుంటాయి. ఒక గుడ్డును పెట్టి పొదుగుతుంది.



క్రెస్టెడ్ సర్పెంట్ ఈగల్

తెలుగులో జుట్టుబైరీ గద్ద అంటారు. ఇండియన్ సబ్‌కాంటినెంట్, దక్షిణ, తూర్పు ఆసియా దేశాల్లో ఇది ఎక్కువగా సంచరిస్తుంటుంది. 41–75 సెం.మీ పొడవు పెరుగుతాయి. అటవీ ప్రాంతాలు, చిత్తడి గడ్డినేలలు ఉండే ప్రాంతాల్లో వేటాడుతుంటాయి. ప్రత్యేకంగా పాములను మాత్రమే చంపి తింటుంది. ఆకాశంలో సుమారు వెయ్యి అడుగుల ఎత్తులో సంచరిస్తుంటుంది. ఆడ, మగ పక్షులు రెండూ కలిసి ఎత్తైన చెట్లపై గూళ్లు నిర్మించుకుంటాయి. ఆడపక్షి సాధారణంగా ఒకసారి ఒక గుడ్డు మాత్రమే పెట్టి పొదుగుతుంది. అరుదుగా రెండు గుడ్లు పెడుతుంది.

నల్లమలలో ప్రత్యేక గద్దల సంచారం



నల్లమల అటవీ ప్రాంతం విభిన్న పక్షులకు నిలయం. వేల కిలోమీటర్లు ప్రయాణించి ఇక్కడకు వస్తాయి. ప్రత్యేకంగా ఆసియా ఖండంలోని నేపాల్, పాకిస్థాన్, మయన్మార్, శ్రీలంక, ఆఫ్ఘనిస్థాన్ తదితర దేశాల నుంచి వివిధ రకాల గద్దలు ఇక్కడకు వస్తాయి. ఇక్కడే గుడ్లు పెట్టి పొదుగుతాయి. మాంసాహారం మాత్రమే తింటాయి. సుమారు వెయ్యి అడుగుల ఎత్తులో ఆకాశంలో సంచరిస్తుంటాయి. ఈ గద్దల్లో పలు ప్రత్యేకతలు ఉన్నాయి. వీటిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది.

– **మహమ్మద్ హయాత్**, రిటైర్డు ఎఫ్ఆర్ఓ, వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్

మెడికల్ కళాశాలను కేంద్ర బృందం సందర్శన

- ఈ ఏడాది నుంచే ఎంబీబీఎస్ అడ్మిషన్లు ప్రారంభించేందుకు చర్యలు



జీజీహెచ్ సూపరింటెండెంట్ సావిత్రితో మాట్లాడుతున్న కేంద్ర బృందం

మార్కాపురం: మార్కాపురం పట్టణ శివార్లలో సుమారు రూ.475 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న మెడికల్ కళాశాల నిర్మాణాన్ని, జీజీహెచ్ భవన సముదాయాన్ని, వైద్య సేవలను సోమవారం ఢిల్లీ నుంచి వచ్చిన ఎన్ఎంసీ (నేషనల్ మెడికల్ కౌన్సిల్) బృందం ఎన్ఎంసీ చైర్‌పర్సన్ డాక్టర్ బీవా బోరువా (అస్సాం), డాక్టర్ సంజీర్‌కుమార్ భట్ (లక్నో), డాక్టర్ సతీష్ ఛవాన్ (హుబ్లీ) స్థానిక ప్రిన్సిపల్, అదనపు డీఎంఈ డాక్టర్ ఎస్‌వీవీ నాగరాజమన్నార్, జీజీహెచ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పీ సావిత్రితో కలిసి పరిశీలించారు. ఉదయం 10 గంటలకు రాయవరం సమీపంలోని మెడికల్ కళాశాలకు వెళ్లి నిర్మాణంలో ఉన్న బ్లాకులను, హాస్టల్స్‌ను పరిశీలించారు. గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్‌కు వచ్చి వైద్యశాలలో ఉన్న 440 బెడ్ల నిర్మాణాన్ని, ఓపీ, ఐపీ విభాగాలను పరిశీలించారు. మొత్తం 72 మంది ప్రొఫెసర్లు, అసిస్టెంటు ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లతో మాట్లాడారు. ఇందులో 69 మంది ప్రొఫెసర్లు, అసిస్టెంటు ప్రొఫెసర్లు సోమవారం విధులకు హాజరుకాగా మిగిలిన ముగ్గురు మెడికల్ లీవ్‌లో ఉన్నట్లు తెలిపారు. జూలై 31 నాటికి కళాశాల భవనాలు పూర్తిచేస్తామని నిర్మాణ సిబ్బంది టీముకు తెలిపారు. అనంతరం వైద్యశాలలో ఉన్న పరికరాలను పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. ఈ ఏడాది నుంచి ఎంబీబీఎస్ అడ్మిషన్లు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఎన్ఎంసీ బృందం తనిఖీ ప్రాధాన్యత సంతరించుకుంది. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హయాంలో మార్కాపురంలో మెడికల్ కళాశాల నిర్మాణం ప్రారంభమైంది. మొత్తం 150 సీట్లు కేటాయించారు. భవన నిర్మాణాలు పూర్తి కాగానే కౌన్సెలింగ్‌లో మార్కాపురం మెడికల్ కళాశాలను కూడా చేరుస్తారు. వీరి వెంట అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అనీల్‌కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పీ రవికుమార్, పలువురు వైద్యులు ఉన్నారు.

ఆర్టీసీ స్థలాల లీజులు మాకొద్దు

- 17 చోట్ల ఆర్టీసీ స్థలాలు కబ్జా చేశామన్నది అవాస్తవం
- ఆర్టీసీ బలవంతం మీదే మాకు అగ్రిమెంట్
- 4 చోట్ల దరఖాస్తు చేస్తే 2 ప్రాంతాల్లో లీజు అనుమతి వచ్చింది
- ఆర్టీసీ లీజు ధరలు మార్కెట్ ధర కన్నా ఎక్కువే
- నష్టపోతున్నందున ఆ రెండు లీజులను కూడా రద్దు చేయండి
- చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

ఒంగోలు సెంట్రల్: ''రాష్ట్ర వ్యాప్తంగా 17 చోట్ల ఆర్టీసీ స్థలాలు కబ్జా చేశామన్నది అవాస్తవం. అధిక ధరకు కోడ్ చేసిన వారిని బెదిరించామన్నది పచ్చి అబద్ధం..'' అని వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనయుడు, చంద్రగిరి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అన్నారు. తమపై అసత్య ఆరోపణలు చేస్తూ ఒక పత్రికలో ప్రచురితమైన కథనంపై చెవిరెడ్డి మోహిత్ రెడ్డి మాట్లాడుతూ...చట్ట ప్రకారం ఆర్టీసీ అధికారులు వారి ఆధీనంలోని ఖాళీ స్థలాలను లీజు ఇవ్వటానికి నోటిఫికేషన్ జారీ చేస్తే పీలేరు, తెనాలి, అద్దంకి, ఒంగోలు ప్రాంతాల్లో దరఖాస్తు చేసుకున్నామని, అయితే రెండు చోట్ల (అద్దంకి, ఒంగోలు) మాత్రమే అనుమతులు వచ్చాయని చెప్పారు. అది కూడా అందరి కన్నా ఎక్కువ కోడ్ చేసినందున తమకు వచ్చిందే తప్ప ఎక్కడా ఎవరినీ బెదిరించి తీసుకున్నది కాదని, లీజు అనుమతి వచ్చిన తర్వాత తాము అక్కడ కోడ్ చేసిన ధర చెల్లించడానికి సాధ్యం కాదని తెలుసుకుని పనులు కూడా చేపట్టలేదని చెప్పారు. అనుమతులు వచ్చిన ఆ రెండు చోట్ల లీజు అనుమతులు రద్దు చేసుకోవటానికి కూడా సిద్ధంగా ఉన్నామని అన్నారు. ఆ విషయం ఆర్టీసీ అధికారులకు కూడా వివరించామని చెప్పారు. అద్దంకి బస్టాండ్ సమీపంలో లీజు అనుమతులు వచ్చిన స్థలంలో ఎలాంటి నిర్మాణ పనులు చేయకున్నా సరే గత ఆరు నెలలుగా నెలకు రూ.లక్ష చొప్పున అద్దె చెల్లిస్తున్నామని తెలిపారు. ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్ వద్ద స్థలానికి తాము రూ.2.30 లక్షలు కోడ్ చేస్తే మరొకరు రూ.2 లక్షల ముప్పై వేల ఐదు వందలు కోడ్ చేశారని మాకు వాళ్లకు కేవలం రూ.500 మాత్రమే తేడా ఉన్నా ఆర్టీసీ అధికారులు ఎక్కువ కోడ్ చేసిన వారికే అనుమతులు ఇచ్చారన్నారు. తర్వాత నెల రోజులకు ఆర్టీసీ అధికారుల నుంచి మాకు ఒక లేఖ వచ్చిందని..మొదటగా కోడ్ చేసిన వారు డిపాజిట్ చెల్లించనందున రెండో స్థానంలో కోడ్ చేసిన తమకు అవకాశం ఇస్తున్నట్లు అందులో పేర్కొన్నారని తెలిపారు. దాంతో ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్ స్థలాన్ని నియమ నిబంధనల ప్రకారం తీసుకున్నామని చెప్పారు. ఆర్టీసీ స్థలాల లీజు విషయంలో చట్టప్రకారం వెళ్లామే తప్ప ఎక్కడా చట్టాన్ని అతిక్రమించలేదని, ఆర్టీసీ నిబంధనల మేరకు తీసుకున్న అద్దంకి, ఒంగోలు ఆర్టీసీ స్థలాలు తప్ప మరెక్కడా మాకు లీజు భూములు లేవని తెలిపారు. ఆ రెండు స్థలాలు కూడా లీజు ధర ఎక్కువ కావటంతో ప్రతి నెలా అద్దె చెల్లించలేక నష్టపోతున్నామని అన్నారు. ఆ రెండు స్థలాల లీజులను కూడా రద్దు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామని వివరించారు.

శేషవాహనంపై శ్రీవారి దర్శనం



స్వామివారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

మార్కాపురం: మార్కాపురం పట్టణంలోని కంభం రోడ్డులో వెలసిన ప్రసన్న వేంకటేశ్వరస్వామి వారి షష్ఠమ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం భక్తులకు శేషవాహనంపై ఉభయ దేవేరులతో కలిసి దర్శనమిచ్చారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం 6 గంటలకు ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ప్రధాన అర్చకులు అరుణ్‌స్వామి ఆధ్వర్యంలో పూర్ణాహుతి, యాగశాల ప్రవేశం, మూలవిరాట్‌కు అష్టోత్తరపూజ నిర్వహించారు. భక్తులకు గరుడప్రసాదం అందచేశారు. సోమవారం సాయంత్రం శేషవాహనంపై స్వామివారి నగరోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఓం నమో వేంకటేశాయ... గోవింద.. గోవింద నామస్మరణల మధ్య భక్తులు వాహన సేవలో పాల్గొన్నారు. కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు టీపీ వెంకటేశ్వర్లు, కార్యదర్శి ఎం కొండలరావు, అదనపు కార్యదర్శి నిట్టూరి రమేష్ తదితరులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.



శేషవాహనంపై శ్రీవారు



ధ్వజారోహణంలో పాల్గొన్న భక్తులు, అర్చకులు

అంగన్‌వాడీలపై నీలా బృందం దందా

- ఆర్‌టీఐ యాక్టివిస్ట్ పేరున అధికారం చెలాయింపు
- ఉన్నతాధికారుల్లా రికార్డుల తనిఖీలు
- డబ్బులిస్తే...పరిశీలన ఏమీ ఉండదని బేరసారాలు



రికార్డులు పరిశీలిస్తున్న సురేష్, మరొక వ్యక్తి

పొదిలి: పొదిలి సీడీపీవో కార్యాలయంలో రీజినల్ అధికారి స్థాయిలో రికార్డుల పరిశీలన జరుగుతోంది. చూసే వారికి ఎవరికైనా పెద్ద హంగామాలా కనిపిస్తుంది. కుర్చీలో నీలా సురేష్, మరొక వ్యక్తి కూర్చున్నారు. సూపర్‌వైజర్లు వారి రికార్డులను టేబుల్‌పై ఉంచి ఎదురుగా కూర్చున్నారు. కేంద్రాల్లో కార్యకర్తలు మొత్తం రికార్డులు సిద్ధం చేసుకుని ఎప్పుడు వస్తే, అప్పుడు చూపించేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇంతకూ ఈ సురేష్ ఎవరు అతను రీజినల్ అధికారి స్థాయిలో ఈ రికార్డుల తనిఖీలు ఎందుకు చేస్తున్నారో ఎవరికీ అర్థం కాలేదు. వివరాల్లోకి వెళితే.. రైట్ టు ఇన్ఫర్‌మేషన్ యాక్ట్ సభ్యుడినంటూ...అంగన్‌వాడీ కేంద్రాల్లో, సీడీపీవో, పీడీ కార్యాలయాల్లో ఏం జరుగుతుందో నాకు సమాచారం కావాలి.. గత పద్నాలుగు, పదిహేను సంవత్సరాలుగా రికార్డులు పూర్తి స్థాయిలో సమాచారం ఇవ్వాలంటూ మొదటగా ఆర్‌టీఐ యాక్ట్ ద్వారా సమాచారం కోరటం... తరువాత దాని గురించి పట్టించుకోకుండా రికార్డుల పరిశీలన పేరుతో డబ్బులు డిమాండ్ చేయటం నీలా సురేష్ అనే వ్యక్తి చేస్తున్న దందాగా అంగన్‌వాడీలు, యూనియన్ నాయకులు ఆరోపిస్తున్నారు. జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలు తనిఖీ చేయాలంటూ పలు సీడీపీవో కార్యాలయాల నుంచి డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. నేను అడిగే రికార్డులు మీరు ఎలాగూ ఇవ్వలేరు, దాని జిరాక్స్ కాపీలకే వేలల్లో ఖర్చులు అవుతాయని బెదిరిరపులకు దిగుతున్నారని, లక్షల్లోనే డబ్బులు వసూలు చేశారని యూనియన్ నాయకులు ఆరోపిస్తున్నారు. పొదిలిలో ఈతతంగం జరుగుతున్న సమయంలోనే జిల్లా యూనియన్ నాయకులు కలెక్టర్ కార్యాలయంలో సురేష్ అనే వ్యక్తి చేస్తున్న దందా బెదిరింపులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దర్శి, కొండపి, టంగుటూరు, మద్దిపాడు ప్రాజెక్టుల్లో డబ్బులు వసూలు చేసుకున్నాడని ఆరోపణలు చేశారు.

అంగన్‌వాడీ ఫోన్ నంబర్లతో అతనికి ఏంపని? రమేష్

అంగన్‌వాడీ ఫోన్ నంబర్లతో సురేష్ అనే వ్యక్తికి ఏం పని అని సీఐటీయూ కార్యదర్శి రమేష్ ప్రశ్నించారు. పీడీ అనుమతితోనే రికార్డుల పరిశీలన చేస్తున్నారని సురేష్ ఎందుకు చెబుతున్నాడని ప్రశ్నించారు. మహిళా కార్యకర్తల ఫోన్ నంబర్లు, చిరునామాలు అతనికి చేరితే, అసభ్య మేసేజ్‌లు, వీడియోకాల్స్ వచ్చే ప్రమాదం ఉందన్నారు. ఆర్‌టీఓ యాక్ట్ పేరున పురుషులను విజిటింగ్ కోసం ఎలా అనుమతిస్తారన్నారు. అసలు సురేష్ బృందానికి అనుమతి ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని రమేష్ డిమాండ్ చేశారు. సురేష్ దందాపై తగు విచారణ చేపట్టాలని సెంటర్ల విజిటింగ్‌లు వెంటనే ఆపేలా చూడాలని రమేష్ డిమాండ్ చేశారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

- ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్



ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న నాయకులు

యర్రగొండపాలెం: వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు అండగా ఉంటానని, సమస్యలు ఏమైనా ఉంటే పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. స్థానిక కొలుకుల రోడ్డులోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. కూటమి నాయకులు ప్రభుత్వ కార్యాలయాలను తమ పార్టీ కార్యాలయాలుగా మార్చుకోవటానికి సన్నద్ధం అవుతున్నారని, అధికారులు కూడా ఏక పక్షంగా వ్యవహరిస్తున్నారని ఆయన విమర్శించారు. మండలాల్లో అటువంటి పరిస్థితి ఉంటే తన దృష్టికి తీసుకొని రావాలన్నారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు శాలువలు కప్పి ఘనంగా సన్మానించారు. తమ గ్రామాలలో ఉన్న సమస్యలపై ఆయనతో చర్చించారు. అనంతరం మండలంలోని ఎల్లారెడ్డిపల్లె జరిగిన ఒక శుభ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాలలో రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ దుగ్గెంపూడి వెంకటరెడ్డి, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు కొప్పర్తి ఓబులరెడ్డి, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్ బాష, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పి.రాములు నాయక్, సర్పంచ్ ఆర్.అరుణాబాయి, పల్లె సరళాకుమారి, వివిధ విభాగాల నాయకులు ఉమామహేశ్వరరెడ్డి, రావూరి సుబ్బారావు, కొత్రపోలు సుందరరావు, వై.వెంకటేశ్వరరెడ్డి, ఎస్.వెంకటరెడ్డి, బి.బాల చెన్నయ్య, పబ్బిశెట్టి శ్రీనివాస్, మేడగం వెంకటరెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

సుభాష్ చంద్రబోస్ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు అర్బన్: భారత ప్రభుత్వం నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా జనవరి 23వ తేదీ సుభాష్ చంద్రబోస్ ఆపద ప్రబంధన్ పురస్కారాలను విపత్తుల నిర్వహణలో విశిష్ట సేవలు చేసిన వారిని గుర్తించేందుకు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆ మేరకు పురస్కారాలను అర్హత ఉన్న వ్యక్తులకు, సంస్థలకు ఇస్తామని, అర్హత ఉన్న వారు జూలై 1వ తేదీ నుంచి 31వ తేదీ లోగా httpr://awardr.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఆస్తి లాగేసి.. తల్లిని గెంటేసి..

- కుమారుడి కర్కశత్వంపై తల్లి ఫిర్యాదు

మార్కాపురం: తల్లి పేరుపై ఉన్న ఇంటిని తన పేరున రాయించుకున్న కుమారుడు.. కొద్దిరోజులకే వక్ర బుద్ధి బయటపెట్టాడు. నిర్దాక్షిణ్యంగా తల్లిని ఇంటి నుంచి బయటకు వెళ్లగొట్టాడు. కడుపున పుట్టిన కుమారుడి కర్కశత్వంపై బోరున విలపించిన ఆ వృద్ధురాలు సోమవారం మార్కాపురం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై అబ్దుల్ రెహమాన్ కథనం ప్రకారం.. పట్టణంలోని కరెంటు ఆఫీసు ప్రాంతంలో వెన్నా సావిత్రమ్మ నివాసముంటోంది. ఇటీవల తాను ఉంటున్న ఇంటిని కుమారుడి పేరున అగ్రిమెంట్ రాసింది. కొద్దిరోజులు బాగా చూసుకున్న కుమారుడు ఆమెను బయటకు గెంటివేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కారు- ట్రాక్టర్ ఢీ ఒకరు మృతి

అద్దంకి: కారు ,ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. ఈఘటన మండలంలోని దర్శి-అద్దంకి రహదారిలో తిమ్మాయపాలెం గ్రామ సమీపంలో సోమవారం రాత్రి జరిగింది. అందిన వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా దర్శి మండలంలోని చామంతిపూడికి చెందిన బీ పవన్‌కుమార్ రెడ్డి (37) విజయవాడలో హోల్‌సేల్ ప్లైవుడ్ దుకాణం నడుపుతుంటారు. ఈ క్రమంలో దర్శి, చీమకుర్తి, ఒంగోలు, కనిగిరి ప్రాంతాల్లో విక్రయించిన ప్లైవుడ్ తాలూకు నగదు వసూలుకు మధ్యాహ్నం 11 గంటలకు వచ్చారు. వసూలు పనులు పూర్తి చేసుకుని దర్శి నుంచి విజయవాడ వెళ్తున్నాడు. మార్గమధ్యంలో మండలంలోని తిమ్మాయపాలెం గ్రామ సమీపంలో ప్రకాశం జిల్లాలోని పోలవరం గ్రామం నుంచి పొగాకు చెక్కలతో వెళ్తున్న ట్రాక్టర్‌ను క్రాస్ చేసే సమయంలో ఢీకొట్టాడు. దీంతో కారులో ప్రయాణిస్తున్న పవన్ కుమార్‌రెడ్డి అక్కడిక్కడే మృతిచెందాడు. కారు నడుపుతున్న నరేందర్‌రెడ్డి స్వల్పగాయాలతో బయటపడ్డాడు.

స్థానికుల సమాచారం మేరకు క్షతగాత్రుడిని 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమితత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతిడికి భార్య, ఇరువురు సంతానం కలదు. స్థానికుల సమాచారం మేరకు ఎస్సై నాగరాజు ఘటనా స్థలానికి చేరుకుని వివరాల సేవకరణతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నాడు.

బోసిపోయిన తీరప్రాంతం

- సముద్ర తీరప్రాంతాల్లో పర్యాటకులకు నో ఎంట్రీ
- పర్యాటకులను అనుమతించని పోలీసులు
- వ్యాపారం తప్ప పర్యాటకుల భద్రతా చర్యలు చేపట్టని రిసార్ట్స్ యాజమన్యాలు
- నెల రోజుల్లో 18 మంది తీరంలో మృత్యువాత



తీరం నుంచి పర్యాటకులను పంపించి వేస్తున్న పోలీసు అధికారులు

చీరాల టౌన్: వాడరేవు, రామాపురం మరో మినీ గోవాగా మారింది. రిసార్టుల సంఖ్య పెరగడం పర్యాటకుల దాకిడి అధికంగా ఉంది. ముఖ్యంగా వారాంతపు సెలవుల్లో శని, ఆదివారాలు వందల సంఖ్యలో వాడరేవు, రామాపురం బీచ్‌లకు హైదరాబాద్‌తో పాటుగా రాష్ట్రంలోని పలు జిల్లాలకు చెందిన పర్యాటకులు అధికంగా వస్తుంటారు. అయితే రామాపురం తీర ప్రాంతం అనుకూలంగా లేదు. లోతు ఎక్కువగా ఉండటంతో పాటుగా సుడిగుండాలు అధికంగా ఉన్నాయి. దీంతో సముద్ర తీరాన్ని అంచనా లేకండా కొందరు పర్యాటకులు ఉత్సాహంగా లోనికి వెళ్లడంతో సుడిగుండాల్లో చిక్కు తనువు చాలిస్తున్నారు. ముఖ్యంగా యువతే అధికంగా ఉన్నారు. నిబంధనల ప్రకారం సూర్యలంక, వాడరేవు, రామాపురాన్ని పర్యాటక ప్రాంతంగా ప్రకటించింది. ప్రస్తుతం స్థానిక మెరైన్, సివిల్ పోలీసుల వైఫల్యం తీవ్రంగా కనిపిస్తుంది. ప్రమాదకర స్థలాల్లో డేంజర్ బోర్డులు, ప్రమాదాలకు గురికాకుండా మైక్ అనౌన్స్‌మెంట్, బోర్డులు పెట్టలేదు. గజ ఈతగాళ్లు లేకపోవడంతో అలల సవ్వడికి ఆకర్షితులై యువకులు క్షణాల్లో గల్లంతై ప్రాణాలు వదిలివేస్తున్నారు. రిసార్టు యాజమానులు కనీసం పర్యాటకులు లైఫ్ జాకెట్లు కూడా అందించకపోవడంతో తీరం మృత్యుకుహరంగా మారింది. భారీగా వస్తున్న రాకాసి అలలకు పర్యాటకులు మృత్యువాత పడుతున్నారు.

పర్యాటకులకు నో ఎంట్రీ..

సముద్ర తీర ప్రాంతాలైన చీరాల నియోజకవర్గంలో రామాపురంలో గడిచిన గత నెల రోజుల నుంచి సముద్రంలో గల్లంతై 18 మంది యువకులు మృత్యువాత పడ్డారు. అలల సవ్వడులు కాస్తా పర్యాటకులకు చావు డప్పులా మారింది. ఏలూరు జిల్లాకు చెందిన స్నేహితులు నలుగురు. మంగళగిరికి చెందిన స్నేహితులు ఇద్దరు, కావూరివారిపాలేనికి చెందిన ఒకరు, తాడేపల్లిగూడేనికి చెందిన యువకుడు, చెన్నైకి చెందిన వ్యక్తి ఒకరు ఇలా చెప్పుకుంటూ పోతే రామాపురం తీర ప్రాంతం పర్యాటకులను హరించి వేస్తుంది. ఒక్క వారం లోనే ఏడుగురు మృత్యువాత పడగా నెలరోజుల్లో 18 మంది రాకాసి అలలకు బలైపోయారు. దీంతో పోలీసులు చీరాల మండలంలోని సముద్ర తీర ప్రాంతమైన విజయలక్ష్మీపురం,వాడరేవు నుంచి వేటపాలెం మండలంలోని రామాపురం, పొట్టిసుబ్బయ్యపాలెం, కఠారిపాలెం గ్రామం వరకు సోమవారం నుంచి పర్యాటకులను తీరంలోని అనుమతిని నిలిపివేశారు. తీరానికి వచ్చే దారుల్లో ఆంక్షలు విధించి ఎవ్వరిని తీరం వద్దకు అనుమతించడం లేదు. రూరల్ సీఐ సత్యనారాయణ, ఎస్సై శివకుమార్, సిబ్బంది తీరప్రాంతంలోకి ఎవ్వరికి ప్రవేశం లేదని చాటింపు చేయించి తీరంలో ఉన్న పర్యాటకులను ఇళ్లకు పంపించి వేశారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారిని తీరంలో స్నానాలు చేయకుండా హెచ్చరించి పంపించారు. దీంతో తీర ప్రాంతంలోని ఎవ్వరికి అనుమతి లేదు.



తీరం ఒడ్డున పోలీసు సిబ్బందికి సూచనలందిస్తున్న సీఐ, ఎస్సై

అలస్యంగా మేలుకున్న పోలీసులు..

పర్యాటక రంగంలో దూసుకెళ్తున్న సముద్ర తీర ప్రాంతంలో ఓ వైపు కనీస సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నప్పటికి సముద్ర స్నానాలు చేయాలని విహార యాత్ర కోసం వచ్చిన పర్యాటకుల యాత్ర మాత్రం విషాద యాత్రగా మారుతోంది. చీరాల వాడరేవు, రామాపురం తీరప్రాంతాలకు తెలంగాణా, ఆంధ్ర రాష్ట్రాలకు చెందిన పర్యాటకులు శెసెలవు రోజుల్లో అధికంగా వస్తుంటారు. అయితే గతంలో వారానికి ఒకరు లేదా ఇద్దరు సముద్రం అలలకు బలయ్యేవారు. అయినప్పటికి సివిల్ మెరైన్ పోలీసులు, నామ మాత్రపు గస్తీని మాత్రమే ఏర్పాటు చేసేవారు. శని, ఆది వారాల్లో మినహా మిగిలిన రోజుల్లో తీర ప్రాంతాల్లో పోలీసులు మచ్చుకైనా కానరారు. దీంతో పర్యాటకులు తమ ఇష్టానుసారంగా సముద్రంలోకి దిగి ప్రాణాలు కోల్పోతున్నారు. జూన్ నెల లోనే 18 మంది పర్యాటకులు కడలి కోపానికి బలవ్వడంతో ఇప్పుడు పోలీసులు మేల్కొన్నారు.

3 పికెట్లు ఏర్పాటు..

ప్రస్తుతం సముద్ర తీర ప్రాంతంలో 10 బీట్లు, 3 పికెట్లు ఏర్పాటు చేసి 24 గంటలు గస్తీ కాస్తున్నామని సీఐ సత్యనారాయణ తెలిపారు. తీరానికి ఎవ్వరిని రాకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అయితే పర్యాటక ప్రాంతమైన వాడరేవు, రామాపురం తీర ప్రాంత గ్రామాల్లో పర్యాటకులను అప్రమత్తం చేయడంతో పాటుగా అత్యవసరమైన ఏవీటీ వాహనం, గత ఈతగాళ్లకు లైఫ్ జాకెట్లు, ఇతర పరికరాలను వాడరేవుకు చెందిన రామానంద సరస్వతి స్వామీజీ ట్రస్ట్ అందించిన పరికరాలు ఏమయ్యాయే తెలియని పరిస్థితి ఏర్పడింది. దాతలు ఇచ్చిన పరికరాలను పక్కన పెట్టారా.. ? ఏమాయ్యాయో.. ? అని తీరప్రాంత ప్రజలు చర్చించుకుంటున్నారు.



సముద్ర తీరప్రాంతమైన రామాపురంలో గస్తీ కాస్తున్న రూరల్ సీఐ సత్యనారాయణ, ఎస్సైలు

రామాపురం తీరం అనుకూలం కాదనే ప్రచారం..?

సముద్ర తీర ప్రాంతమైన రామాపురం తీరంలోనే అధికంగా పర్యాటకులు గల్లంతై మృత్యువాత పడటంతో రామాపురం తీరం పర్యాటకులు స్నానాలు చేసేందుకు అనుకూలం కాదేమోననే అనుమానాలు, ప్రచారాలు జరుగుతున్నాయి. వాడరేవులో ఖరీదైన రిసార్టులు, భవంతులు లేకపోవడం, చేపల అమ్మకాలు, ఎగుమతులు అధికంగా ఉండటంతో సేఫ్ అయిన వాడరేవు తీరానికి కాకుండా సుడి గుండాలు, లోతు, ప్రమాద భరితంగా ఉండే రామాపురానికే పర్యాటకులు అధికంగా వెళ్లడం, కనీస రక్షణ చర్యలు లేకపోవడంతోనే అధికంగా పర్యాటకులు మృత్యువాత పడుతున్నారనే ప్రచారం జోరుగా జరుగుతోంది.

పర్యాటకుల భద్రత పట్టించుకోని రిసార్టు యజమానులు..

పర్యాటకులను ఆకర్షించేందుకు విలాసవంతమైన భవనాలు, స్విమ్మింగ్ పూల్స్, అదిరిపోయే ఈవెంట్లు ఏర్పాటు చేసి లక్షలు వసూళ్లు చేసే రిసార్టు యాజమానులు మాత్రం వారి రిసార్టులకు వచ్చిన వారి భద్రత, యోగ క్షేమాల గురించి పట్టించుకునే నాథుల్లే కరువయ్యారు. ఎక్కడా లేని విధంగా 12 గంటలకు ఒక్కో రిసార్టు రూ.6 వేల నుంచి రూ.14 వేలు బిల్లులు వసూళ్లు చేస్తున్న రిసార్టులు పర్యాటకులకు అవసరమైతే అదనపు చార్జీలతో క్యాంప్ ఫైర్లు, సీ నైట్ డిన్నర్, రెయిన్‌డ్యాన్స్, గానా భజానాలు ఏర్పాటు చేసే ఈ రిసార్టులు పర్యాటకుల నుంచి 24 గంటలు డబ్బులు దోచుకుంటున్నారే కానీ కనీసం భద్రత ఏర్పాట్లు గజ ఈతగాళ్లు, లైఫ్ జాకెట్లు, హెచ్చరిక బోర్డులు, సముద్రం లోతు ప్రాంతం అనే బోర్డులు మచ్చుకైనా ఏర్పాటు చేయరు. వారి ఆదాయం వారిది.. పర్యాటకులు ప్రాణాలతో వారికి లెక్కే లేకుండా పోతున్నారు రిసార్టు యాజమానులు.

ఫిర్యాదుల పరిష్కారంలో సమయపాలన పాటించాలి

- కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ప్రజా ఫిర్యాదులు పరిష్కరించడంలో నాణ్యతతో పాటు సమయపాలన పాటించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అధికారులకు సూచించారు. స్పందన భవనంలో సోమవారం మీకోసం కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. గ్రీవెన్స్‌లో వచ్చిన ప్రజా సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరించాలన్నారు. లాగిన్‌లో వచ్చిన అర్జీలను నిరంతరం పరిశీలిస్తూ పరిష్కరించాలన్నారు. అర్జీదారులు సంతృప్తి చెందేలా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, డీఆర్‌ఓ శ్రీలత, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు లోకేశ్వరరావు, మాధురి వివిధ శాఖల జిల్లా, డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు. గ్రీవెన్స్ అనంతరం ఎన్నికల విధుల్లో ఉత్తమ పనితీరు చూపిన అధికారులు, సిబ్బందికి కలెక్టర్ ప్రశంసాపత్రాలు అందచేశారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్



ప్రశంసాపత్రాలు అందచేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

- ఉలవపాడు మండలం భీమవరం గ్రామానికి చెందిన ఆర్ సుజాత గ్రీవెన్స్‌లో కలెక్టర్‌ను కలిసి తనకు రేషన్ కార్డు ఇప్పించాలని కోరుతూ అర్జీ అందచేశారు. తనకు నలుగురు సంతానం ఉన్నారని వారి చదువుల కోసం రేషన్ కార్డు ఇప్పించాలని విన్నవించారు.
- దర్శికి చెందిన షేక్ ఖాదర్‌బాష గ్రీవెన్స్‌లో అధికారులను కలిసి వారి కుటుంబం నూర్ బాషా కులానికి చెందిన వారని, అయితే తన కూతురికి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో టీసీ ఇచ్చేటప్పుడు ఇండియన్-హిందూ-దూదేకుల అని ఇచ్చారని తెలిపారు. టీసీలో నూర్‌బాషా రాయించి న్యాయం చేయాలని కోరుతూ అర్జీ అందచేశాడు.

ముంపు గ్రామాల రైతులను ఆదుకోవాలి

- సబ్ కలెక్టర్ రాహుల్ మీనాకు వినతి



సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం, సీపీఐ నాయకులు

మార్కాపురం టౌన్: పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణం కోసం ఇళ్లు, పొలాలను త్యాగం చేసిన రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు వి.హనుమారెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.వీరారెడ్డి, నియోజకవర్గ కార్యదర్శి అందె నాసరయ్య మాట్లాడుతూ.. కరువుకాటకాలకు నిలయమైన పశ్చిమ ప్రకాశం ప్రజలకు వరప్రసాదమైన వెలుగొండ ప్రాజెక్టు రైతులకు ఆర్అర్ ప్యాకేజీ ఇచ్చి, గృహాలు కట్టించి నష్టపరిహారం ఇవ్వాలని, వెంటనే వెలుగొండకు నీటిని వదలాలని కోరారు. సొరంగ మార్గంలో మట్టి నిల్వలు పేరుకుపోయాయని, వాటిని తక్షణమే తొలగించాలన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని 32 మండలాల్లోని 4.50 లక్షల ఎకరాలకు సాగునీరు, 16 లక్షల మందికి తాగునీరు లభిస్తుందన్నాన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు దేవండ్ల శ్రీనివాస్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్కే ఖాశీం, రైతు సంఘ నాయకులు కొండయ్య, ఎస్.వెంకటేశ్వర్లు, పి.వెంకటేశ్వర్లు, మన్నె సాంబ శివరావు, బాణాల రామయ్య తదితరులు పాల్గొన్నారు.

తిరుమలనాథస్వామికి ప్రత్యేక పూజలు



విష్ణుమూర్తి అవతారంలో తిరుమలనాథస్వామి



పల్లకిలో ఊరేగిస్తున్న శ్రీదేవి, భూదేవి సమేత తిరుమలనాథస్వామి

పెద్దారవీడు: మండలంలో చట్లమిట్ల పంచాయతీ రాజంపల్లి గ్రామం సమీపంలో వెలిసిన కలియుగ పుణ్యక్షేత్రమైన గొంఢ్రాలికొండ తిరుమలనాథస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేత తిరుమలనాథస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు కాశావజ్జల భవానీప్రసాద్ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, అర్చనలు, కుంకుమార్చన, మంగళ హారతి, ప్రసాద వితరణ, తదితర పూజలు నిర్వహించిన అనంతరం పట్టువస్త్రాలు, బంగారు అభరణాలు, పూలమాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. విష్ణుమూర్తి అవతారంలో తిరుమలనాథస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవ విగ్రహాలు స్వామి, అమ్మవార్లను అలంకరించి పగలు ఉత్సవం పల్లకిలో, రాత్రి గరుడ వాహనంపై ఆలయం ప్రాంగణంలో భాజ భజంత్రీలతో ఊరేగింపు చేశారు. భక్తులు స్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

బైక్ అదుపుతప్పి యువకుడు మృతి



మృతిచెందిన చిన్నకాశయ్య

కొమరోలు: దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా బైక్ అదుపు తప్పిన ఘటనలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా, అతని తల్లికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన సోమవారం కొమరోలు మండలంలోని నల్లగుంట్ల గ్రామ సమీపంలో కడప-అమరావతి రాష్ట్రీయ రహదారిపై చోటుచేసుకుంది. బేస్తవారిపేట పట్టణానికి చెందిన చిన్నకాశయ్య(26), తల్లి పీరమ్మ ద్విచక్ర వాహనంపై వైఎస్సార్ జిల్లా బ్రహ్మంగారి మఠం వెళ్లారు. వీరబ్రహ్మేంద్ర స్వామిని దర్శనం చేసుకుని తిరిగి వస్తున్న సమయంలో నల్లగుంట్ల గ్రామ సమీపంలోని మూల మలుపు వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో చిన్నకాశయ్య అక్కడికక్కడే మృతి చెందగా, తల్లి పీరమ్మకు చేయి విరిగింది. క్షతగాత్రురాలిని 108 వాహనంలో గిద్దలూరులోని వైద్యశాలకు తరలించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. చిన్నకాశయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సత్తా చాటిన వైఎస్సార్ జిల్లా ఎడ్లు



బండ లాగుతున్న ఎడ్ల జత

పెద్దారవీడు: మండలంలోని రాజంపల్లి గ్రామం సమీపంలో గొంఢ్రాలికొండ తిరుమలనాథ స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని తెలుగు రాష్ట్రాల స్థాయి ఆరు పళ్ల సైజు విభాగం ఎడ్ల పోటీలు సోమవారం హోరాహోరీగా సాగాయి. పోటీలో 9 ఎడ్ల జతలు పాల్గొన్నాయి. వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు మండలం రంగసాయిపల్లి గ్రామానికి చెందిన మార్తాల వెంకటసుబ్బారెడ్డి ఎడ్ల జత 4541 అడుగులు లాగి మొదటి స్థానంలో నిలిచాయి. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం తోటపాలెం గ్రామానికి చెందిన రామినేని రత్తయ్య చౌదరి, యర్రగొండపాలెం మండలం వై కొత్తపల్లి గ్రామానికి చెందిన ఉసేన్ సంయుక్త ఎడ్ల జత 4200 అడుగులు లాగి రెండో స్థానంలో, తాళ్లూరు మండలం కర్లాపురం గ్రామానికి చెందిన మేడిగం హర్షవర్ధన్‌రెడ్డి ఎడ్ల జత 3800 అడుగులతో మూడో స్థానం, నంద్యాల జిల్లా బండి ఆత్మకూరు మండలం కోడూరు గ్రామానికి చెందిన చాగంటి నాగమల్లికార్జునరెడ్డి ఎడ్ల జత 3600 అడుగులతో నాలుగో స్థానం, కంభం మండలం సూరేపల్లి గ్రామానికి చెందిన బిజ్జం వెంకటసుబ్బారెడ్డి ఎడ్ల జత 3,400 అడుగులు లాగి ఐదో స్థానంలో నిలిచాయి. మొదటి బహుమతి రూ.35 వేలను కంచర్ల కేశయ్య, రెండో బహుమతి రూ.20 వేలను కుందురు సుబ్బరాయుడురెడ్డి, మూడో బహుమతి రూ.15 వేలను దేవిరెడ్డి మల్లికార్జునరెడ్డి, నాలుగో బహుమతి రూ.10 వేలను తడికళ్ల బాలసుబ్బారావు, ఐదో బహుమతి రూ.5 వేలను గోదాపు సత్యనారాయణరెడ్డి ఎడ్ల యజమానులకు అందజేశారు. పోటీలను తిలకించేందుకు రైతులు, స్థానిక గ్రామాల ప్రజలు భారీ సంఖ్యలో హాజరయ్యారు. న్యాయనిర్ణేతలుగా వెన్నా బోడిరెడ్డి, డి.వెంకటేశ్వరరెడ్డి, ఈ సుధాకరరెడ్డి, బైరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, గోదాపు సత్యనారాయణరెడ్డి, యాంకర్‌గా వల్లెల వెంకటరామిరెడ్డి వ్యవహరించారు.

నిజాయితీ చాటుకున్న జాష్టి శ్రీనివాసులు



బాధితునికి నగదు అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

తాళ్లూరు(ముండ్లమూరు): మండలంలోని తూర్పుగంగవరం గ్రామానికి చెందిన జాష్టి శ్రీనివాసులు తనకి దొరికిన రూ.16 వేల నగదును అప్పగించి తన నిజాయితీ చాటుకున్నాడు. దీంతో బాధిత గంగిరెడ్డి యర్రయ్య కృతజ్ఞతలు తెలిపారు. దర్శి మండలం పాపిరెడ్డిపాలేనికి చెందిన గంగిరెడ్డి యర్రయ్య ఆదివారం గుంటిగంగమ్మ అమ్మవారి ఆలయానికి వచ్చి రూ.16 వేల నగదు పోగొట్టుకున్నారు. దీంతో ఆలయ సిబ్బంది ఆ విషయాన్ని మైక్ ద్వారా ప్రచారం నిర్వహించారు. జాష్టి శ్రీనివాసులు ఆదివారం రాత్రి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా దారిలో నగదు ఉన్న కవర్ దొరికింది. ఇంటికి వెళ్లిన తర్వాత తిరిగి గంగమ్మ అమ్మవారి ఆలయం వద్దకు వెళ్లారు. అక్కడ కొందరు నగదు పోయిన విషయం చర్చించుకుంటుంగా..శ్రీనివాసులు రూ.16 వేల నగదు తనకు దొరికిందని ఆలయ సిబ్బంది దృష్టికి తీసుకువచ్చారు. దీంతో బాధిత గంగిరెడ్డి యర్రయ్యను తూర్పు గంగవరం సచివాలయం వద్ద నగదు అందజేశారు. నిజాయితీ చాటుకున్న జాష్టి శ్రీనివాసులును ఆలయ కమిటీ సభ్యులు, సచివాలయ సిబ్బంది అభినందించారు.